ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక


## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 35 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 18 మే 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


### కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలనేదే

# ప్రభుత్వ లక్ష్యం : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌లో జరుగుతున్న వీహబ్ వుమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి దేశానికి మహిళా శక్తి అంటే ఏమిటో చూపించింది కాంగ్రెస్ పార్టీనే



హైదరాబాద్, మే 17 (ప్రభాత ఉదయం): దేశానికి మహిళా శక్తి అంటే ఏంటో చూపించింది కాంగ్రెస్ పార్టీనేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ జేఆర్సీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన వీహబ్ వుమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాంకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు సంస్థలతో వీహబ్ చేసుకున్న ఎంఓయూలకు సంబంధించిన పత్రాలను ఆయా కంపెనీల ప్రతినిధులకు అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ మహిళా శక్తిని తక్కువ అంచనా వేయదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భారత మహిళా శక్తి ఏంటో ఇందిరాగాంధీ చూపించారని, సోనియా గాంధీ సుదీర్ఘంగా పార్టీని నడిపి తన సమర్థతను నిరూపించుకున్నారని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు రాష్ట్రంలో ఎక్కడి వెళ్లాలన్నా, సునాయాసంగా వెళ్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. వారివల్ల ఆర్టీసీ లాభాల్లోకి వెళ్లిందన్నారు. పాఠశాలలు, పిల్లలకు యూనిఫాంలు ఇలా ప్రతీది మహిళల చేత సమర్థవంతంగా నడుస్తోందని వివరించారు. హైటెక్ సిటీ పక్కనే మూడున్నర ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి బజార్ రాష్ట్రానికి తలమానికంగా మారిందని చెప్పారు. పట్టణ ప్రాంత మహిళలు కూడా సెర్ప్‌లో చేరాలని సీఎం రేవంత్ రెడ్డి ..మిగతా 2లో



### ఇక పాక్‌పై
# దౌత్యయుద్ధం

### శశిథరూర్ సహా ఏడుగురు ఎంపీలతో విదేశాలకు బ్రీఫింగ్

న్యూఢిల్లీ, మే 17 (ప్రభాత ఉదయం): ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు పాక్‌పై తీసుకుంటున్న దౌత్య చర్యల్లో భాగంగా విదేశాలకు భారత ప్రతినిధి బృందాలను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచదేశాలకు వివరించడం కోసం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసింది. ఆ ప్రతినిధుల బృందాలకు నాయకత్వం వహించే ఏడుగురు ఎంపీల పేర్లను శనివారం ప్రకటించింది. వీరిలో కాంగ్రెస్ నుంచి సీనియర్ నాయకుడు శశిథరూర్ ఉన్నారు. ఎంపీలు శశిథరూర్ (కాంగ్రెస్), రవిశంకర్ ప్రసాద్(భాజపా), బైజయంత్ పాండా (భాజపా) ..మిగతా 2లో

## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు.. ముగ్గురి మృతి



అన్నవరం: మే 17 (ప్రభాత ఉదయం): కాకినాడ జిల్లా తుని వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది . ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మృతులంతా రాజమహేంద్రవరం అపోలో ఫార్మసీ ఉద్యోగులు మృతులను రాజమహేంద్రవరానికి చెందిన గెడ్డం రామరాజు, ..మిగతా 2లో

## భారత మిస్సైళ్లు మా స్థావరాలను తాకాయి



2

నిజం ఒప్పుకున్న పాకిస్థాన్
భారత బాలిస్టిక్ మిస్సైళ్లు నూర్‌ఖాన్ వాయు స్థావరాన్ని తాకినట్లు ప్రధాని అంగీకారం

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, మే 17 (ప్రభాత ఉదయం): పార్టీలకు అతీతంగా హైదరాబాద్ అభివృద్ధికి ప్రజాప్రతినిధులంతా కలిసికట్టుగా పనిచేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికలప్పుడు రాజకీయాలని, తరవాత అంతా అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. దేశాభివృద్ధికి ఇదే కీలకమని అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే పదవులు, రాజకీయ పార్టీలు శాశ్వతం కాదన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎస్పీఆర్ హిల్స్‌లో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన రిజర్వాయర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ , మేయర్ విజయలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు, జలమండలి ఎండీ అశోక్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. హైదరాబాద్ అభివృద్ధికి సహకరిస్తామని కేంద్రం చెబుతోందన్నారు. మెట్రో డీపీఆర్‌ను పూర్తిస్థాయిలో కేంద్రానికి పంపలేదని.. సమగ్రంగా పంపిస్తే ఆలోచిస్తుందని చెప్పారు. ప్రజలకు ఎలా మేలు చేస్తున్నామనేది నేతలు ఆలోచించాలని తెలిపారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు.. తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు.



## పాకిస్థాన్‌కు గూఢచర్యం

### మహిళా యూట్యూబర్ అరెస్టు

న్యూఢిల్లీ, మే 17 (ప్రభాత ఉదయం): భారత్‌లో ఉంటూ పాకిస్థాన్‌కు అనుకూలంగా పనిచేస్తున్న ఆరుగురిని హరియాణా పోలీసులు అరెస్టు చేశారు. ఈ నిందితులను హరియాణాలోని వివిధ ప్రాంతాల నుంచి అదుపులోకి తీసుకున్నారు. తాజాగా హిస్సార్ ప్రాంతానికి చెందిన మహిళా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. న్యాయస్థానంలో హాజరుపరచగా ఆమెకు ఐదు రోజుల పోలీసు రిమాండ్ విధించారు.

**పాక్ అధికారితో బంధం!**

జ్యోతి మల్హోత్రా ఒక ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్. యూట్యూబ్‌లో ఆమె ఛానల్‌కు 3.7 లక్షలకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. పాక్ అధికారుల సాయంతో పలుమార్లు దాయాది దేశంలో ఆమె పర్యటించారు. వాట్సాప్, టెలిగ్రామ్, స్నాప్‌చాట్ వంటి మెసేజింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో పాక్ వ్యక్తులతో మాట్లాడిన ఆమె, దేశ భద్రతకు ముప్పు తెచ్చే సమాచారాన్ని చేరవేసిందని అధికారులు పేర్కొన్నారు. 2023లో పాక్‌కు వెళ్లిన బృందంలో తాను ఉన్నట్లు, అప్పుడే అహ్సన్ ఉర్ రహీమ్ అలియాస్ డానిష్‌ను కలిసినట్లు పోలీస్ విచారణలో జ్యోతి అంగీకరించినట్లు చెప్పారు. పాకిస్థాన్ ..మిగతా 2లో

ప్రభాత ఉదయం



# కొనసాగుతన్న సరస్వతీ పుష్కరాలు

## పుణ్యస్నానం ఆచరించిన మంత్రి తుమ్మల

కాళేశ్వరం,మే17(ప్రభాత ఉదయం): కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాలు ఘనంగా సాగుతున్నాయి. పుష్కర ఘాట్‌లో మూడో రోజు పుణ్యస్నానాలు ఆచరించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కాళేశ్వరం ముక్తేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం కారణంగా రహదారులన్నీ బురదమయంగా మారాయి. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ప్రత్యేక హెలికాప్టర్‌లో కాళేశ్వరానికి చేరుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పుణ్య స్నానం ఆచరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. కాళేశ్వరం ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలకు సహకరించారు. ఇకపోతే కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు వెళ్లే భక్తుల వాహనాలకు టోల్ ట్యాక్స్ రద్దు చేశారు. ఈమేరకు భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ప్రకటించారు. వాహనాల రద్దీ నియంత్రణకు టోల్ ట్యాక్స్ రద్దు చేసినట్లు ప్రకటించారు.



# ఇక పాక్‌పై దౌత్యయుద్ధం

మొదటి పేజీ తరువాయి...

సంజయ్ కుమార్ ఝా(జేడీయూ), కనిమొళి (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్సీపీ -ఎస్పీ), శ్రీకాంత్ శిందే (శివసేన) విదేశాల్లో భారత బృందాలకు నాయకత్వం వహించనున్నట్లు కేంద్రం వెల్లడించింది.

వీరి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన మొత్తం ఏడు గ్రూపులు 10 రోజుల వ్యవధిలో ఐదు దేశాలకు వెళ్తాయి. ఈవిషయంపై కేంద్ర ప్రభుత్వం విపక్షాలతో చర్చలు జరిపి బృంద సభ్యులను ఎంపిక చేసింది. వీరు మే 22న విదేశాలకు బయలుదేరి జూన్ మొదటివారంలో తిరిగి వచ్చే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్ ఏవిధంగా మద్దతు పలుకుతోందనే విషయాన్ని.. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదంపై భారత్ జరిపిన పోరాటాన్ని పలు ఆధారాల ద్వారా విదేశాలకు వివరించనున్నట్లు సమాచారం. వీరు ముఖ్యంగా ఐదు అంశాలను ప్రపంచ దేశాలకు వివరించనున్నారు.

1. ఆపరేషన్ సిందూర్ చేపట్టడానికి కారణమైన పాకిస్థాన్ రెచ్చగొట్టే చర్యలు
2. పాక్ బెదిరింపులకు దీటుగా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను ఎలా చేపట్టిందో వివరణ
3. భవిష్యత్తులో భారత్‌పై ఉగ్రదాడులు జరిగితే ప్రభుత్వం తీసుకునే చర్యలపై స్పష్టత
4. ఆపరేషన్ సమయంలో ఉగ్రవాద స్థావరాలను మాత్రమే కచ్చితంగా లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని, పౌరులకు ఎలాంటి హానీ చేయలేదని స్పష్టతనివ్వడం
5. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ..ఉగ్రవాదులకు సహకరించడంలో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్ అనుసరిస్తున్న పాత్రను.. దానివల్ల ప్రపంచదేశాలకు పొంచిఉన్న ముప్పును వివరించడం

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్.. పాక్‌పై అనేక దౌత్య చర్యలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం రద్దు, పాక్ పౌరులను తిరిగి స్వదేశానికి పంపడం, వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవడం వంటి చర్యలు చేపట్టింది. అనంతరం "ఆపరేషన్ సిందూర్" పేరుతో పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులు చేసి, ధ్వంసం చేసింది. ఈ క్రమంలోనే ఆపరేషన్ సిందూర్‌పై కేంద్రం విదేశాల రాయబారులు, మంత్రులకు ప్రత్యేక బ్రీఫింగ్ ఇచ్చింది.

## కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలనేదే

# ప్రభుత్వ లక్ష్యం : సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి...

సూచించారు. ఆడబిడ్డలు వ్యాపారంలో నిలదొక్కుకుంటే కుటుంబాలు ఆర్థికంగా బాగుంటాయని అన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు ఒక యూనిక్ ఐడీ కార్డు ఇస్తామన్నారు. మహిళల ఆరోగ్యం నుంచి సంపాదన వివరాలన్నీ తెలిపేలా యూనిక్ ఐడీ కార్డు ఉంటుందని స్పష్టం చేశారు. కోటి మంది మహిళలు కోటీశ్వరులు కావాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టంగా చెప్పారు. రాష్ట్రం 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ చేరుకోవాలంటే మహిళలు కోటీశ్వరులు కావాలని తెలిపారు. ఈనెల 21న ఇందిరా మహిళా స్టాళ్లను సందర్శించనున్న మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు : ఆడబిడ్డలకు రూ. 500లకే సిలిండర్ అందిస్తున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణను మహిళలకే అప్పగించామని, మహిళల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు కృషి చేస్తామని మాటిచ్చారు. ఈనెల 21న ఇందిరా మహిళా స్టాళ్లను మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శిస్తారని వెల్లడించారు. సెర్ప్ సభ్యుల సంఖ్యను కోటి మందికి చేర్చాలని, మహిళలకు అండగా నిలబడతా ఆర్థికంగా ఎదగండని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. కార్పొరేట్ కంపెనీలకు డబ్బులు ఇస్తే తీసుకొని దేశం విడిచి పారితున్నారని, మహిళలకు ఇచ్చే ప్రతి రూపాయి వడ్డీతో సహా చెల్లిస్తున్నామని చెప్పారు. మహిళలు ఆర్థిక క్రమశిక్షణ



పాటిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. కాగా అక్కడ ఏర్పాటు చేసిన అన్ని స్టాళ్లను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించి, ఆయా ఉత్పత్తుల గురించి విక్రయదారులను అడిగి తెలుసుకున్నారు.

# పాకిస్థాన్‌కు గూఢచర్యం

నిఘా సంస్థకు చెందిన ఓ అధికారితో సంబంధం కొనసాగించిందని, ఇండోనేషియా కూడా వెళ్లొచ్చిందని పోలీసులు తెలిపారు.

**డానిష్‌తో సంప్రదింపులు!**

భారత్‌కు వచ్చిన తర్వాత కూడా డానిష్‌తో జ్యోతి సంప్రదింపులు కొనసాగించినట్టు పోలీసులు తెలిపారు. అతడి సూచన మేరకు, అహ్వాన్ అనే వ్యక్తిని కలుసుకుందని చెప్పారు. అప్పుడే పాక్ నిఘా, రక్షణ విభాగాలకు చెందిన వ్యక్తులను అతను జ్యోతి మల్హోత్రాకు పరిచయం చేశాడని తెలుస్తోంది. ఎవరి కంటాపడకుండా ఉండేందుకు తన పాకిస్థానీ కాంటాక్ట్‌ల వివరాలను ఇతర పేర్లతో సేవ్ చేశానని ఆమె అంగీకరించినట్లు తెలుస్తోంది. ఆమె నిరంతర సంబంధాలు అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్ ఉల్లంఘన కిందికే వస్తుందని పోలీసులు వెల్లడించారు. అందుకే ఆమె పంపిన సమాచారం, ఇతరుల ప్రమేయం గురించి అధికారులు ఆరా తీస్తున్నారు.

**చివరికి విద్యార్థులు కూడా!**

పోలీసులు అరెస్టు చేసిన వారిలో 25 ఏళ్ల దేవేంద్ర సింగ్ అనే విద్యార్థి కూడా ఉన్నాడు. ఇండియాకు చెందిన కీలక సమాచారాన్ని అతడు పాక్‌కు చేరవేసినట్లు పోలీసులు గుర్తించారు. పటియాలా ఖల్సా కాలేజీలో పొలిటికల్ సైన్స్ చదువుతున్న దేవేంద్ర సింగ్, తన సోషల్ మీడియా ఖాతాల్లో తుపాకులు, పిస్టోల్స్‌తో ఉన్న ఫొటోలను అప్‌లోడ్ చేశాడు. పాక్ అధికారులతో కలిసి ఉన్న ఫొటోలనూ పోస్ట్ చేశాడు. ఈ క్రమంలో దేవేంద్రపై నిఘా పెట్టిన పోలీసులు గతేడాది నవంబర్‌లో అతడు పాకిస్థాన్‌కు వెళ్లినట్లు గుర్తించారు. అక్కడ పాక్ అధికారులు భారీగా డబ్బు ముట్టజెప్పి ప్రలోభపెట్టడంతో దేవేంద్ర ఉచ్చులో పడ్డట్లు భావిస్తున్నారు. అతడి ఫోన్ స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ విశ్లేషణ చేస్తున్నారు.

# తెలంగాణ సింహగర్జనకు సరిగ్గా 24 ఏళ్లు

## కరీంనగర్ వేదికగా కెసిఆర్ ఉద్యమ పిలుపు

## అదో చారిత్రక సన్నివేశమన్న కెటిఆర్



హైదరాబాద్,మే17(ప్రభాత ఉదయం): దశాబ్దాలపాటు- దగాపడ్డ తెలంగాణ ప్రజల ఆకాంక్షలే లక్ష్యంగా ప్రత్యేక రాష్ట్ర సాధనకు పునాది వేసిన తెలంగాణ సింహగర్జనకు సరిగ్గా 24 ఏళ్లు అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. కరీంనగర్ వేదికగా ఉద్యమ రథసారథి కేసీఆర్ ఆనాడు పూరించిన సమరశంఖం ఢిల్లీ వరకూ ప్రతిధ్వనించిన అపూర్వ సందర్భమది అని పేర్కొన్నారు. తెలంగాణ నలువైపుల నుంచి లక్షలాదిగా తరలివచ్చిన ఆ జనప్రవాహం.. ఓ సముద్రాన్నే తలపించిన చారిత్రక సన్నివేశమది. తెలంగాణ వచ్చేదా సచ్చేదా అని ఎంతో మంది అడుగడుగునా అవమానించినా, రకరకాలుగా అవహేళన చేసినా వెన్నుచూపని ఆ ధీరోదాత్తుడి సంకల్పం ప్రపంచ ఉద్యమాల చరిత్రలోనే ఓ చెరగని సంతకం. ఒక అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ, ఒక్కరితో మొదలైన ఆనాటి ప్రయాణం అనుకున్న గమ్యాన్ని ముద్దాడటమే ఒక చారిత్రక విజయమైతే.. ఇక ఉద్యమ నాయకుడే ఉత్తమ పాలకుడై, సాధించిన తెలంగాణను పదేళ్లలోనే దేశానికే దారిచూపి దీపస్తంభంలా తీర్చిదిద్దిన ఆ దార్శనికత.. ప్రతి తెలంగాణ బిడ్డకు ఎప్పటికీ గర్వకారణం అని కేటీ-ఆర్ పేర్కొన్నారు. జై తెలంగాణ.. జై కేసీఆర్ అని కేటీఆర్ వివరించారు.

# డ్రగ్స్ కట్టడిలో తెలంగాణ అగ్రస్థానం

## ఎక్స్ వేదికగా పోలీసులకు సిఎం అభినందనలు



హైదరాబాద్,మే17(ప్రభాత ఉదయం): డ్రగ్స్ కట్టడిలో ప్రపంచంలోనే తెలంగాణ అగ్రస్థానం సాధించడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. 138 దేశాలతో పోటీపడి ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉందని చెప్పారు. ఈ ఘనత సాధించిన హైదరాబాద్ నగర సీపీ సీవీ ఆనంద్, ఆయన బృందానికి అభినందనలు తెలిపారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకు కృషి చేస్తున్న ప్రతి పోలీసుకు మద్దతుగా ఉంటామన్నారు. ప్రపంచానికే తెలంగాణ రోల్ మోడల్‌గా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.

# ముంబై విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

## బెదిరింపు మెయిల్ రాకతో పోలీసుల అప్రమత్తం

ముంబై,మే17(ప్రభాత ఉదయం): ముంబై విమానాశ్రయ పోలీసులకు బాంబు బెదిరింపు ఇమెయిల్ వచ్చింది. ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం, ప్రసిద్ధ తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్ ను పేల్చేస్తామని బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. సమాచారం ప్రకారం, ఈ ఇమెయిల్ నేరుగా పోలీసుల అధికారిక ఇమెయిల్ ఐడికి పంపబడింది. ఉగ్రవాది అప్జల్ గురు, సాయిబాబు శంకర్ ఉరిశిక్షలను బెదిరింపు మెయిల్‌లో దుండగులు ప్రస్తావించినట్లు సమాచారం. వారిద్దరిని అన్యాయంగా ఉరితీశారని ఆరోపిస్తూ..ముంబైలోని రెండు ప్రముఖ ప్రదేశాలపై దాడులు చేస్తామని బెదిరించినట్లు- అధికార వర్గాలు తెలిపాయి. బెదిరింపు ఈమెయిల్ అందిన వెంటనే ముంబై పోలీసులు రంగంలోకి దిగి సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. విమానాశ్రయం, హోటల్ ప్రాంగణాలను స్కాన్ చేయడానికి బృందాలను నియమించారు. రెండు ప్రదేశాలలో భద్రతను పెంచారు. ముంబైలోని కీలక ప్రదేశాలలో నిఘా పెంచినట్లు అధికారులు తెలిపారు. అయితే, ప్రస్తుతానికి ఎటు-వంటి అనుమానాస్పద వస్తువులు గుర్తించలేదని అధికారులు చెప్పారు. ఈమెయిల్ ద్వారా బెదిరింపు వెనుక ఉన్న వ్యక్తిని గుర్తించడానికి అధికారులు ప్రస్తుతం దర్యాప్తు చేపట్టారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు.. ముగ్గురి మృతి

హాజరత్ వాలీ, తణుకుకు చెందిన వరాడ సుధీర్‌గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ గోనా శివశంకర్, వెంకట సుబ్బారావును చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన సమావేశానికి హాజరై కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆగిఉన్న లారీ విశాఖపట్నం నుంచి మండపేటకు ఐరన్ లోడ్‌తో వెళ్తోంది.

**రోడ్డు ప్రమాదంపై మంత్రి లోకేశ్ దిగ్భ్రాంతి**

ఈ ప్రమాదంలో ముగ్గురి మృతి పట్ల మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# భారత్-పాకిస్థాన్ దేశాలు

## మళ్లీ శాంతి చర్చలు జరుపాలి : రష్యా



భారత్-పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలపై ఆ రెండు దేశాలు పరస్పర చర్చలు జరుపాలని ఇప్పటికే అమెరికా, చైనా భారత్‌కు సూచించాయి. తాజాగా రష్యా కూడా ఆ జాబితాలో చేరింది. 'ఇరుదేశాల మధ్య ఉన్న సమస్యలపై భారత్, పాకిస్థాన్ ప్రత్యక్ష శాంతి ఒప్పంద చర్చలు జరపాలని ఆశిస్తున్నాం. ఈ విషయంలో ఇరుదేశాలు పరస్పర విశ్వాసంతో ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నాం' అని రష్యన్ ఫెడరేషన్ విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్-పాకిస్థాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా స్పందిస్తూ.. భారత్, పాక్‌ల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని స్వాగతించింది. రెండు దేశాల మధ్య సంఘర్షణ నివారణకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ప్రకటించింది. రెండు దేశాలు శాంతి మార్గాన్ని ఎంచుకోవడాన్ని అభినందిస్తున్నామని వ్యాఖ్యానించింది. భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు చెలరేగినప్పుడు తమ మద్దతు పాక్‌కే అని తెగేసి చెప్పిన చైనా.. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణను మాత్రం సమర్థిస్తున్నట్లు పేర్కొంది. చర్చలు, సంప్రదింపుల ద్వారా ఇరు దేశాల మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించింది. ఇదిలావుంటే భారత్‌తో చర్చలకు పాక్ సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే కశ్మీర్ అంశం కూడా చర్చల్లో చేర్చాలనేది తమ షరతు అని పేర్కొంది.



హైదర్ గూడ నలంద నగర్ పలు కాలనీలలో మోటర్లు పెట్టి నల్ల నీళ్లు తీసుకున్న వారిపై కేసులు నమోదు చేసిన అధికారులు.

# నల్లాలకు మోటార్లు బిగిస్తే కేసులు తప్పవు

బుద్వేల్, మే 17(ప్రభాత ఉదయం,) : మంచినీటి వినియోగదారులు తమ కనెక్షన్ కు మోటారు బిగించి నీటిని తోడితే కేసు నమోదు చేస్తామని రాజేంద్రనగర్ జలమండలి డివిజన్ బుద్వేల్ సబ్ డివిజన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ జోహార్ అలీ హెచ్చరించారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ నలంద నగర్ లో ఓ ఇంట్లో నల్ల కనెక్షన్ కు బిగించిన మోటర్ ను తనిఖీలో పట్టుకున్నారు. నల్ల కనెక్షన్ కు మోటర్ పెట్టడం వల్ల పరిసర ప్రాంతాల వినియోగదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన సూచించారు. జలమండలి ఎండి అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా తనిఖీలు చేస్తున్నమన్నారు. తనిఖీల్లో జెడ్ ఐ జావిద్, పంప్ ఆపరేటర్లు అఖిలేష్, వెంకటేశులు పాల్గొన్నారు.



## ప్రజా ఆశీర్వాదం కోసమే
# సేవా కార్యక్రమాలు

**చెన్నూరు నియోజకవర్గ కాంగ్రెస్ యువజన ప్రధాన కార్యదర్శి జాడి రాజేందర్**

చెన్నూర్, మే 17. (ప్రభాత ఉదయం) :ప్రజాశీర్వాదం కోసమే తమవంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, తాము చేస్తున్న కార్యక్రమాలు కొనసాగేలా తన వెన్నంటే ఉంటూ తనను ముందుకు నడిపించాలని చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ యువజన ప్రధాన కార్యదర్శి జాడి రాజేందర్ కోరాడు. ఈ సందర్భంగా శనివారం రోజున కాంగ్రెస్ నాయకులతో కలిసి రాజేందర్ వారి తాతయ్య నానమ్మల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో అంబలి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గత కొంత కాలంగా చలివేంద్రం తోటి యువ నాయకుల సహకారంతో నిర్వహిస్తున్నామని, రానున్న రోజుల్లోనూ ఈ సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని రాజేందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ నాయకులు చెన్నూరి శ్రీధర్, చెన్నూర్ నియోజకవర్గ ఎన్ ఎస్ యూ ఐ అధ్యక్షులు సంజయ్, జిల్లా నాయకులు జాడి శ్రావణ్, నాయకులు రుకోధర్, మల్లయ్య, రాజబాపు, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబుకు ఊరట

**భూ సేకరణ పోరాట కేసు కొట్టివేత**

హైదరాబాద్,మే17(ప్రభాత ఉదయం): మంత్రి శ్రీధర్ బాబుకు ఊరట దక్కింది. ఆయనపై నమోదైన కేసును కోర్టు కొట్టివేసింది.కాళేశ్వరం ప్రాజెక్టు భూ సేకరణ అంశంలో మంత్రి శ్రీధర్‌బాబుపై సహా 13 మందిపై నమోదైన కేసును నాంపల్లి కోర్టు కొట్టివేసింది. 2017లో శ్రీధర్‌బాబుతోపాటు- పలువురు కాంగ్రెస్ నేతలపై అప్పటి ప్రభుత్వం కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. కేసును కోర్టు కొట్టివేసిన అనంతరం శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. భూములు కోల్పోతున్న రైతుల తరఫున పోరాడితే కేసులు పెట్టారని, చివరికి న్యాయమే గెలిచిందని అన్నారు.

# ఎస్పీఆర్ హిల్స్ ప్రాంత ప్రజల తీరిన దాహార్తి..!!





**రూ. 5.7 కోట్లతో నిర్మించిన రిజర్వాయర్ ప్రారంభం..**
**బోరబండ, రహ్మత్ నగర్ డివిజన్ల తీరన ప్రజల ఇక్కట్లు..**
**52 బస్తీలకు,పరిసర ప్రాంతాలకు లబ్ది..**
**ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి పొన్నం, మేయర్**

రాజేంద్రనగర్,మే17(ప్రభాత ఉదయం) తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత,ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేస్తోంది. ముఖ్యంగా ప్రజలకు అవసరమైన తాగునీటి సరఫరా లాంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది.అందులో భాగంగా నగరంలో రూ.5.7 కోట్లతో రహమత్ నగర్ డివిజన్ లోని ఎస్పిఆర్ హిల్స్ లో నూతనంగా నిర్మించిన రిజర్వాయర్ ను శనివారం రోజున కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,మేయర్ గద్వాల విజయ లక్ష్మీ,రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి,హైదరాబాద్ ఇంచార్జి మినిస్టర్ పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు.జిహెచ్ఎంసి పరిధిలో బోరబంద,రహమత్ నగర్ డివిజన్ లలోని 52 బస్తీల్లోని,పలు కాలనీల నీటి సమస్యను తీర్చడానికి ప్రభుత్వం దాదాపు రూ.5 కోట్ల వ్యయంతో 3 మిలియన్ లీటర్ల రిజర్వాయర్ ను నిర్మాణం చేపట్టి పూర్తి చేసింది.రికార్డ్ స్థాయిలో ఏడాదిన్నరలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ రిజర్వాయర్ అందుబాటులోకి వస్తే..రెండు డివిజన్ల పరిధిలోని 52 బస్తీల లలోని 15 వేల కనెక్షలకు లబ్ది చేకూరుతుంది.దీంతోపాటు ఈ ప్రాంతం ఎక్కువగా ఎత్తు పల్లంగా ఉండడంతో లో ప్రెషర్ తో నీటి సరఫరా జరిగేది..ఆ సమస్య పరిష్కారం అవుతుంది.అలాగే ఈ రిజర్వాయర్ నిర్మాణం వల్ల బోరబంద,రహమత్ నగర్ డివిజన్లోని 52 బస్తీల్లోని ప్రజలకు నీటి ఇబ్బందుల నుండి శాశ్వతంగా విముక్తి లభించింది.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ..హైదరాబాద్ లో తాగు నీటి సమస్య పరిష్కారం చేయడానికి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.ఓఆర్ఆర్ వరకు విస్తరించిన ప్రాంతంలో గత 10 సంవత్సరాల్లో 13.80 లక్షల నల్లా కనెక్షన్లు పెరిగాయన్నారు.అలాగే దాదాపు 7 వేల కోట్లతో 20 టీఎంసీల నీటిని తీసుకొచ్చే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుందని వివరించారు.ఈ రిజర్వాయర్ నిర్మాణంతో రహమత్ నగర్,బోరబంద ప్రజలు చాలా కాలంగా ఎదుర్కుంటున్న సమస్య తీరిందని ఆనందం వ్యక్తం చేశారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ..ఎన్నో సంవత్సరాలుగా ఈ రిజర్వాయర్ పూర్తి చేయాలని,రహమత్ నగర్ ప్రజలు ఆందోళన చేశారు.అనేక ఆందోళనల తర్వాత పూర్తి అవ్వడం సంతోషంగా ఉందని అన్నారు.గత పదేళ్లలో ఒక్క చుక్క అదనపు నీరు నగరానికి అందలేదని శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరానికి నీటిని పెంచాల్సిన అవసరం ఉంది అని ముగించారు.ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ..ఈ ప్రాంతంలో నీటి నిల్వ సామర్థ్యం లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో మూడు రోజులకు నీటి సరఫరా చేయడంతో ప్రజలు ఇబ్బంది పడేవారని అన్నారు.దీంతోపాటు మరికొన్ని బస్తీల్లో రాత్రి సమయంలోనూ మంచినీటి సరఫరా చేయడం,లో ప్రెషర్ లాంటి సమస్యలు ఉండేవి..అవన్నీ ఈ రిజర్వాయర్ ప్రారంభంతో తీరిపోతున్నాయని వివరించారు.అలాగే ఈ రిజర్వాయర్ నిర్మాణంతో అన్ని ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీటి సరఫరా చేయడంతో పాటు రాత్రి సమయంలో కాకుండా ఉదయం నుండి సాయంత్రం సమయాల్లో సరఫరా చేసే వెసులుబాటు ఉంటుందని అన్నారు.మొత్తం రూ.5.7 కోట్లతో నిర్మించిన ఎస్పిఆర్ హిల్స్ రిజర్వాయర్ వల్ల బోరబంద,రహమత్ నగర్ డివిజన్లలోని 52 బస్తీలకు లబ్ది చేకూరుతుందని చెప్పారు.కోటి ముప్పై లక్షల జనాభా ఉన్న నగరానికి ప్రతినిత్యం 555 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నామని..అయినా కొన్ని ప్రాంతాల్లో రెండు రోజులకు ఒక్కసారైనా సరఫరా చేయలేకపోతున్నామని అన్నారు.అయితే ప్రభుత్వం గోదావరి ప్రాజెక్టు ఫేజ్ 2కు అనుమతులు ఇచ్చిందని..ఇప్పుడు ఆ ప్రాజెక్టు టెండర్ దశ పూర్తిచేసుకుందని చెప్పారు.త్వరలో నిర్మాణ పనులకు చేపడతామని..ఈ గోదావరి ప్రాజెక్టు పేజ్-2 పూర్తి చేస్తే నగరానికి 20 టీఎంసీల నీటిని తరలించే అవకాశం ఉందని అన్నారు.ఈ జలాలతో నగరానికి 30 సంవత్సరాలు వరకు సంవృద్ధిగా నీటి సరఫరా చెయ్యవచ్చని ఎండీ ధీమా వ్యక్తం చేశారు.అలాగే నగరంలో జలమండలి సరఫరా చేస్తున్న నీటిలో ప్రజల ఇంటి వద్ద అధికంగా నీటి వృథా జరుగుతుందని అన్నారు.ఈ నీటి వృథాను తగ్గించేందుకుని..నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు ఎండీ అశోక్ రెడ్డి విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో జల మండలి ఈడి మయాంక్ మిట్టల్,జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఇన్చార్జి అజారుద్దీన్,రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్,కార్పొరేటర్లు సిఎన్ రెడ్డి,బాబా ఫసియుద్దీన్,జలమండలి ఈడి మయాంక్ మిట్టల్,డైరెక్టర్లు,అధికారులు అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుర్తింపు సంఘం ఎన్నికలలో ఎం శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్ ఘన విజయం

**శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్ ధాటికి తట్టుకోలేని అవతలి ప్యానెల్**
**అందరి కంటే మెజారిటీ లో ఎస్ కె నజీర్**
**ఓటర్లకు ధన్యవాదాలు తెలిపిన శ్రీనివాస్ యాదవ్**



ఎం శ్రీనివాస్ యాదవ్



ఎస్ జయరాం



ఎస్ కె నజీర్

బుద్వేల్, మే 17(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుర్తింపు సంఘం ఎన్నికలలో ఎం శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్ సభ్యులందరు భారీ మెజారిటీ తో విజయం సాధించారు. అధ్యక్షుడు గా పోటీచేసిన ఎం శ్రీనివాస్ యాదవ్ కు 430 ఓట్లు పోలవ్వగా పి మహేష్ కు 204 ఓట్లు వచ్చాయి. 226 ఓట్ల మెజారిటీ తో శ్రీనివాస్ యాదవ్ గెలుపొందారు. అసోసియేట్ ప్రెసిడెంట్ గా పోటీ చేసిన ఎం రాజు 200 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవి కోసం పోటీ చేసిన ఎం దశరథ 207 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శి గా పోటి చేసిన ఎస్ జయరాం సామ అమృత్ రెడ్డి పై 94 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు. సంయుక్త కార్యదర్శిగా జీ పరమేశ్ 138 ఓట్ల మెజారిటీ తో గెలిచారు. కార్య నిర్వాహక కార్యదర్శి గా ఎస్ రవీందర్ రెడ్డి 39 ఓట్ల తేడాతో విజయం సాధించారు. సాంకేతిక కార్యదర్శిగా జి సులోచన 141 ఓట్ల మెజారిటీ తో విజయం సాధించారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ గా ఎం సంజీవ రెడ్డి 174 ఓట్ల మెజారిటీ తో గెలిచారు. కోశాధికారి గా పోటి చేసిన ఎస్ కె నజీర్ 246 ఓట్ల మెజారిటీ తో ఘన విజయం సాధించారు.

**ఓటు వేసిన ఉద్యోగులు అందరికి ధన్యవాదాలు : ఎం శ్రీనివాస్ యాదవ్, అధ్యక్షులు, పీ జే టి ఏ యు :**

వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుర్తింపు సంఘం ఎన్నికలలో తమ ప్యానెల్ సభ్యులందరికీ ఓటు వేసి గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ గెలుపు తమలో మరింత బాధ్యత ను పెంచింది. విశ్వవిద్యాలయం లో పని చేస్తున్న ప్రతి ఉద్యోగి కోసం పని చేస్తాం. త్వరలోనే అన్ని స్టేషన్ లలో సమావేశాలు నిర్వహించి కృతజ్ఞతలు చెప్పే కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.

# ఎం శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్ ఘన విజయం



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎం శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్ సభ్యులు



ఊరేగింపులో ఎం శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్ సభ్యులు

రాజేంద్రనగర్, మే 17(ప్రభాత ఉదయం) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుర్తింపు సంఘం ఎన్నికలలో ఎం శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్ ఘన విజయం సాధించింది. శనివారం జరిగిన ఓట్ల లెక్కింపు లో మొదటి నుంచి శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్ ఆధిక్యత కనబరుస్తూ వచ్చింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కు ఈ నెల 16 న ఎన్నికలు జరుగగా శనివారం ఓట్ల లెక్కింపు జరిగింది. వర్సిటీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు రాజేంద్రనగర్ వ్యవసాయ కలశాల లో జరిగింది. అధ్యక్షుడు గా ఎం శ్రీనివాస్ యాదవ్, అసోసియేట్ ప్రెసిడెంట్ గా ఎం రాజు, ఉపాధ్యక్షునిగా దశరథ, ప్రధాన కార్యదర్శి గా ఎస్ జయరాం, సంయుక్త కార్యదర్శిగా జీ పరమేశ్, కార్యనిర్వాణ కార్యదర్శిగా ఎస్ రవీందర్ రెడ్డి, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా ఎం సంజీవ రెడ్డి, సాంకేతిక కార్యదర్శిగా జీ సులోచన, కోశాధికారిగా ఎస్ కె నజీర్ లు విజయం సాధించారు.

**భారీ ఊరేగింపు :**

వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుర్తింపు సంఘం ఎన్నికలలో ఘన విజయం సాధించిన ఎం శ్రీనివాస్ యాదవ్ ప్యానెల్ సభ్యులు ముందుగా ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఓపెన్ టాప్ జీప్ లో ఊరేగింపు నిర్వహించారు.



విజయోత్సవం..

# అందమైన నగరం కేరళ

## ఎక్కడ చూసినా పచ్చదనమే





కేరళ లోని ఎర్నాకులం సెయింట్ జార్జ్ చర్చ్ వద్ద....

బుద్వేల్, మే 17 (ప్రభాత ఉదయం) కేరళ అందమైన రాష్ట్రం. ఎక్కడ చూసినా పచ్చదనం, చెట్లు ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తుంది. అందమైన భవనాలు కేరళ కు సొంతం అన్నట్లుగా ఉంటుంది. కేరళ నుంచి మున్నార్ వెళ్లే మార్గంలో ఎర్నాకులం సెయింట్ జార్జ్ చర్చ్ ప్రపంచ ప్రసిద్ధి గాంచిందిగా చెబుతుంటారు. పురాతన చర్చ్ పక్కనే కొత్తగా మరో అందమైన సుందరమైన చర్చ్ ను నిర్మించారు. వేసవి లోనూ సాయంత్రం కాగానే కేరళ ప్రాంతంలో వర్షం పడుతూ చల్లదనాన్ని ఇస్తుంది.

# చేనేత పద్మశాలి పిల్లలు ఈ కోర్సులో శిక్షణ పొందుతే కాకతీయ టెక్స్టైల్ పార్కులో ఉద్యోగాల అవకాశం:

## టీపీసీసీ రాష్ట్ర చేనేత విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కాలేజీ అడ్మిషన్ల కోసం అవగాహన సదస్సు



వరంగల్ మే 17, (ప్రభాత ఉదయం బ్యూరో) వరంగల్ నగరంలోనికొత్తవాడలోని పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ భవన్ లో 2025-26 సం.నకు ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభించి విద్యార్థుల నుంచి అడ్మిషన్ ఫారాలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా టిపిసిసి చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు మాటాడుతూ గతం లో హ్యాండ్లూమ్ టెక్నాలజీ కోర్సుల్లో చేరాలంటే తమిళనాడులోని సేలం, ఆంధ్రలోని వెంకటగిరి ప్రాంతాలలో సీట్లు తక్కువ కాంపిటీషన్ ఎక్కువగా ఉ ండే తరుణంలో తెలంగాణ పిల్లలు సీట్లు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెలంగాణలో కూడా ఈ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి వినతులు ఇవ్వగా గత ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మంత్రి సురేఖ ద్వారా ముఖ్యమంత్రి వరంగల్ లో కాకతీయ టెక్స్టైల్ పార్కు అనుబంధంగా వరంగల్ జిల్లాలో టెక్స్టైల్ ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేయడం ద్వారా చేనేత పద్మశాలి పిల్లలు ఈ కోర్సులో శిక్షణ పొందితే కాకతీయ టెక్స్టైల్ పార్కులో ఉ ద్యోగాలు వస్తాయి అన్నారు. ఆ విధంగా ప్రయత్నం చేయాలని కోరడం జరిగింది. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం ద్వారా అనుమతులు తీసుకొచ్చి హైదరాబాదులో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణమునందు 60 సీట్లతో చేనేత ,టెక్స్టైల్ టెక్నాలజీ డిప్లమా కోర్సును ప్రవేశపెట్టడం జరిగింది. మొదటి సం.60 సీట్లు భర్తీ చేయబడి విజయవంతంగా విద్యాసం పూర్తి చేసుకుని రెండవ సం. రానికి అడ్మిషన్ల తీసుకోవడం జరిగింది. భారతదేశం మొత్తంలో 10 ఇలాంటి కాలేజీలు ఉంటే 6 కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నాలుగు మాత్రం రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉండగా ఐదవది తెలంగాణ రాష్ట్రానికి రావడం గర్వించదగ్గ విషయం అని చిప్ప వెంకటేశ్వర్లు నేత అన్నారు. చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. టెక్స్టైల్ డిపార్ట్మెంట్ ఓ ఎస్ డి హిమజ కుమార్ మాట్లాడుతూ ఇందులో చేరగోరే విద్యార్థులు పదవ తరగతి లేదా సమానమైన పరీక్షలలో ఉత్తీర్ణ ఉండవలెనని 2025 జులై నెల ఒకటవ తేదీ నాటికి బీసీ జనరల్ కేటగిరి పిల్లలు గరిష్ట వయోపరిమితి 23 సంవత్సరములు షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల వారికి గరిష్ట వైయోపరిమితి 25 సంవత్సరములు అని తెలిపారు. కోర్సు వ్యవధి మూడు సంవత్సరములు, ఆరు సెమిస్టర్లు అని ప్రతి విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం 2500 రూపాయల స్టైఫండ్ ఇస్తుందని ప్రతి విద్యార్థికి సంవత్సరానికి 4050 రూపాయలు మాత్రమే ఫీజుగా తల్లిదండ్రులు చెల్లించాలని అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం క్యాంపస్ నాంపల్లి హైదరాబాద్ కి దగ్గరలో వసతి సదుపాయాలు కల్పించబడతాయని అందుకు తగు ఖర్చులు విద్యార్థి తల్లిదండ్రులు భరించవలెనని అన్నారు. చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పూర్తి చేసిన దరఖాస్తులు కమిషనర్ చేనేత జౌళి శాఖ కార్యాలయం, చేనేత భవన్, మూడవ అంతస్తు నాంపల్లి హైదరాబాద్ కు రిజిస్టర్ పోస్టు ద్వారా గాని సంబంధిత జిల్లా సహాయ సంచాలకులు చేనేత జౌ ళి శాఖ వారి కార్యాలయం నందు గాని సమర్పించవలెనని అన్నారు. సభ అనంతరం హిమజ కుమార్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ బొట్టు వెంకటేశ్వర్లు, డెవలప్ మెంట్ ఆఫీసర్ సోమ సుదీర్, డిసిసి బ్యాంక్ డైరెక్టర్ ఎలగం రవిరాజు, యెలుగం చిన్నకొమురయ్య, సహకార సంఘాల అధ్యక్షులు కొలిపాక మదనయ్య, ఎలగం చిన్న భద్రయ్య, దూబల రాజేందర్, అడిగోప్పుల సంపత్, కూరపాటి సంపత్, పిట్టా రాములు, పరికిపండ్ల రమేష్,ఎలగం సాంబయ్య, మాచ బత్తుల కుమారస్వామి, శామంతుల శంకర లింగం, కోడూరి రమేశ్, ఆకునూరి జయరాములు చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవగాహన సదస్సును విజయవంతం చేసినారు.



## శ్రీసోమేశ్వర,లక్ష్మీ నరసింహ స్వామికి వెండి కలశములు బహుకరించిన భక్తుడు

వరంగల్ మే 17, (ప్రభాత ఉదయం బ్యూరో) ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పాలకుర్తిలో ని శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహ స్వామి దేవాలయానికి రెండు వెండి కలశములు(చెంబులు) భక్తుడు అనంతుల రవికుమార్ సప్న కుటుంబ సభ్యులు సమర్పించినట్లు ఆలయ ఈవో సల్వాది మోహన్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూస్వామివారి పూజా కార్యక్రమాల్లో వినియోగించడానికి వరంగల్ కు చెందిన భక్తుడు అనంతుల రవికుమార్, స్వప్న కుటుంబ సభ్యులు రూ. 1,35,000 విలువైన సోమేశ్వర స్వామికి 511 గ్రాముల500 మిల్లి గ్రాముల వెండి కలశం, లక్ష్మీ నరసింహ స్వామికి 523 కేజీల 981 గ్రాముల మిశ్రమ వెండి తో తయారు 511.035 మిల్లి గ్రాముల వెండి కలశం ఆలయానికి అందజేసినట్లు ఈవో తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, మంజ రాములు, అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డివిఆర్ శర్మ, దేవగిరి అనిల్ శర్మ, ,మత్తగజం నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



## 40 లక్షలతో సీసీ రోడ్డు, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, మేయర్, కమీషనర్

### సోమిడి బతుకమ్మ చెరువు, కాజీపేట, సోమిడి రోడ్డు పరిశీలించిన ఎమ్మెల్యే

వరంగల్ మే 17, (ప్రభాత ఉదయం బ్యూరో) వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 62వ డివిజన్ సోమిడి హనుమాన్ గుడి పరిధిలో రూపాయలు 40 లక్షలతో అంతర్గత సీసీ రోడ్డులో సైడ్రాన్ నిర్మాణం కోసం వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , నగర మేయర్ గుండు సుధారాణి, జి డబ్ల్యూ ఎం సి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సోమిడి ప్రజలకు బతుకమ్మ ఆడుకునే చెరువు పునరుద్ధరించాలని స్థానిక ప్రజలు కోరగా వెంటనే అధికారులతో కలిసి చెరువు ప్రాంతాన్నిఎమ్మెల్యే పరిశీలించారు.ప్రతి ఏటా బతుకమ్మ పండుగ నాడు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మహిళ మణులు సంతోషకరమైన వాతావరణంలో బతుకమ్మ ఆడాలంటే చెరువు పునరుద్ధరణ కావలసిన విధులు నిధులు వెంటనే అమలు చేసి వచ్చే బతుకమ్మ నాటికి చెరువు పనులను పూర్తి చేస్తామని తెలియజేశారు. అంతర్గత సిసి రోడ్లు సైడే నిర్మాణ పనులు పూర్తి నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమిడి నుంచి ఖాజిపేట రోడ్డు అసంపూర్తిగా ఆగిన రోడ్డు పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరాంఘర్ వద్ద రైల్వే వంతెన కింద సిసి రోడ్డు నిర్మాణ పనులు

బుద్వేల్, మే 17(ప్రభాత ఉదయం) : ఈ నెల 19 నుండి ఆరాంఘర్ రైల్వే వంతెన క్రింద సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభమవుతున్నాయి...దీని కారణంగా దుర్గా నగర్ నుండి ఆరాంఘర్ వైపు వచ్చే ట్రాఫిక్ ను మే 19 ఉదయం 8 గంటలనుండి 15 రోజులపాటు కాటేదాన్ ఓల్డ్ కర్నూల్ రోడ్డు ద్వారా మళ్లీస్తారు... సాధారణ ప్రజలు ఈ విషయాన్ని అర్థం చేసుకొని ట్రాఫిక్ సజావుగా సాగేలా ట్రాఫిక్ పోలీసులతో సహకరించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ గౌడ్ తెలిపారు.



## స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

గద్వాల జిల్లా ప్రతినిధి, మే17 (ప్రభాత ఉదయం) జోగులాంబ గద్వాల జిల్లా స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకోవడం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా షేక్ మస్తాన్వలి ఉపాధ్యక్షులుగా సునీల్ ప్రధాన కార్యదర్శిగా రవి చంద్ర యాదవ్, అదనపు కార్యదర్శిగా. పి. విజయశ్రీ, ట్రెజరీ గా ఏ. రాకేష్ కుమార్ ను ఎన్నుకున్నారు.



## ఉపాధ్యాయులు తమ బోధనను నూతన సాంకేతికతతో నవీకరించుకోవాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, మే17 (ప్రభాత ఉదయం)విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ఉపాధ్యాయులు తమ బోధనను నూతన సాంకేతికతతో నవీకరించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఉపాధ్యాయులకు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో విద్యా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన 5 రోజుల జిల్లా స్థాయి సామర్థ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం -2025 లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజాభివృద్ధికి ఉ పాధ్యాయుల పాత్ర కీలకమని, ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా తనను తాను అభివృద్ధి చేసుకుంటూ బోధన చేస్తేనే విద్యార్థుల్లో గుణాత్మకమైన మార్పు సాధ్యమవుతుందని అన్నారు. సామర్థ్యాల పెంపుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకొని, వాటిని పాఠశాల స్థాయికి తీసుకెళ్లి విద్యార్థుల్లో ఆశించిన మార్పుల సాధనకు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (%ఖీూచీ%) బోధించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (%ూ×%)ని ఉ పయోగించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులలో నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఈ తరహా %ూ×% ఆధారిత పద్ధతులను ప్రభావవంతంగా వినియోగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థులతో సంభాషించి వారి బలహీనతలను గమనించి, అవసరమైన మార్గదర్శనం అందిస్తూ వారి విద్యాభివృద్ధికి సహాయం చేయాలన్నారు. విద్యార్థుల ఆంగ్ల భాషా నైపుణ్యాలు, సంభాషణ సామర్థ్యాలను మెరుగుపర్చడంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పదవ తరగతి ఫలితాల్లో జోగులాంబ గద్వాల జిల్లా 91.74 ఉత్తీర్ణత శాతం సాధించి రాష్ట్రంలో 26వ స్థానాన్ని దక్కించుకుందని తెలిపారు. గత సంవత్సరం 81.38%తో 32వ స్థానంలో ఉన్న జిల్లా,ఈ ఏడాది 10.36 శాతం అభివృద్ధితో 26వ స్థానానికి చేరడం గర్వకారణమని తెలిపారు. ఈ విజయంలో పాత్రవహించిన ఉ పాధ్యాయులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం కలెక్టర్ సెల్ఫీ స్టాండ్ వద్దకు వెళ్లి ఉపాధ్యాయులతో కలిసి సెల్ఫీ తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి అబ్దుల్ గని, ప్రధానోపాధ్యాయులు వెంకట్ నర్సయ్య,కో ఆర్డినేటర్ ఎస్తర్ రాణి,స్కూల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.




## ప్రతి పౌరుడు దేశ రక్షణకు సిద్ధంగా ఉండాలి

### రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు అప్సర్ పాషా

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 17(ప్రభాత ఉదయం) బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డికె. అరుణ సూచన మేరకు జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో శనివారం గద్వాల పట్టణంలోని గద్వాల కోట నుండి పాత బస్టాండ్, క్రిష్ణ వేణి చౌక్, రాజీవ్ మార్గ్, వైఎస్సార్ చౌక్, జాతీయ జెండాలతో ఆపరేషన్ సిందూర్ సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు అప్సర్ పాషా మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం ప్రాణాలు వదిలిన ప్రతి జవాన్కు భారతీయులు రుణపడి ఉన్నారన్నారు. భారతదేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పేలా, ఉగ్రవాదాన్ని రూపుమాపడంలో భారత ప్రధాని మోదీ ప్రవర్తించిన తీరును నేడు ప్రపంచ దేశాలు కొనియాడుతున్నాయన్నారు. ఆపరేషన్ సింధూర్ ఉగ్రవాదులను అంతం చేశామని తెలిపారు. ఆపరేషన్ సింధూర్లో పాల్గొన్న సైన్యానికి హాట్సాఫ్ తెలియజేశారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీనాయక్ త్యాగాన్ని దేశ ప్రజలు మర్చిపోరన్నారు. ఎన్డీఏ ప్రభుత్వానికి దేశ రక్షణే మొదటి ప్రాధాన్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు,మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు ,అక్కల రమా సాయిబాబా,అసెంబ్లీ కి పోటీ చేసిన అభ్యర్థి బలిగేర శివారెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు రజక నరసింహ ,పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ,హిందు సంఘం నాయకులు రాఘవేంద్ర రావు, బ్రమ్మన, రత్న సింహ రెడ్డి తదితరులు ఉన్నారు.

# నకిలీ విత్తనాలను అరికట్టే పూర్తి బాధ్యత డీలర్లపై ఉంది

## జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్



గద్వాల జిల్లా ప్రతినిధి, మే17 (ప్రభాత ఉదయం)జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టే పూర్తి బాధ్యత డీలర్లపై ఉన్నదని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు.శనివారం ఐడీఓసీ సమావేశం హాల్ నందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సౌజన్యంతో డీలర్లకుఈ-పోస్ యంత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీనివాస రావుతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నకిలీ విత్తనాలను అరికట్టి, అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈసారి రుతుపవనాలు ముందుగానే వస్తుండటంతో, వానలు ముందుగానే కురిసే అవకాశముందని వాతావరణ శాఖ చేసిన సూచనల మేరకు రైతులు ఖరీఫ్ పంటకు సిద్ధమవుతున్నారన్నారు. జిల్లాలో రైతులు ఎన్నో ఆశలతో పత్తి సాగు చేస్తారని, నకిలీ విత్తనాల వలన వారి శ్రమ వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత డీలర్లపై ఉందని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించకుండ నాణ్యమైన ప్రభుత్వ గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే విక్రయించాలన్నారు. ఇట్టి విషయంలో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. విత్తనాలు, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం తగదని హితవు పలికారు. దుకాణాలను స్వయంగా సందర్శించి తనిఖీలు చేస్తామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, తప్పనిసరిగా పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా అధికారులు, డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం మేరకు రైతులు నకిలి విత్తనాలతో మోసపోకుండా వాటి సరఫరా పై పూర్తి స్థాయిలో నిఘా ఉంచి కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని అన్నారు.నకిలీ విత్తనాల పై రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని,అలాగే వ్యవసాయ శాఖ అధికారులతో కలసి తనిఖీలు చెయ్యడం జరుగుతుందని అన్నారు.గతంలో నకిలీ సీడ్స్ విషయంలో చాలా కేసులు నమోదు అయ్యాయని, గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ యంత్రాంగం తీసుకున్న చర్యల వల్ల నకిలీ విత్తనాల కేసులు తగ్గాయని అన్నారు. ఇతర రాష్ట్రాల నుండి జిల్లాలోకి వరి ధాన్యం రాకుండా జిల్లా సరిహద్దులో 6 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నివారించడం జరిగిందన్నారు. ఈసారి ఋతు పవనాలు ముందస్తుగా వచ్చే అవకాశం ఉన్నందున డీలర్లు రైతులకు మంచి నాణ్యమైన విత్తనాలు అందజేయాలని, రైతులను మోసం చెయ్యాలనే ఉద్దేశ్యంతో నకిలీ విత్తనాలు అమ్మిన, సరఫరా చేసేవారిపై పీడీ యాక్ట్ కేసులు సైతం నమోదు చేయబడతాయని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా వాటి సమాచారం ఉన్న పోలీస్ లేదు వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని, డీలర్స్, షాపు యజమానులు బాధ్యులు కావద్దని కోరారు. అనంతరం కలెక్టర్ విత్తనాల సరఫరాలో పారదర్శకత కోసం కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వారి సౌజన్యంతో కొత్త ఈ-పాస్ మిషన్ యంత్రాలను 511 మందికి డీలర్లకు అందజేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంలో ఈ మిషన్ ఉ పయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సంగీత లక్ష్మి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, డిఎస్పీ మొగలయ్య, మండల వ్యవసాయ శాఖ అధికారులు, కోరమాండల్ ప్రతినిధి గోవింద్ రావు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608